క్లుప్తంగా

అమ్మవారి సేవలో ఎంపీలు



మడకశిర: పట్టణంలోని వాల్మీకి సర్కిల్ ఆవరణలో ఇటీవల ప్రారంభించిన కొల్లాపురమ్మ, మహేశ్వరిదేవి దేవాలయాన్ని అనంతపురం, హిందూపురం ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు జరిపించారు.

షీఫారంలో చెట్ల నరికివేత



టెంపోలో వేప, సుబాబుల్ దుంగలు

పెనుకొండ: పట్టణానికి కూతవేటు దూరంలోని గొర్రెల పెంపకం క్షేత్రంలో విద్యుత్ తీగలకు రెండు, మూడు సుబాబుల్ చెట్లు అడ్డుగా ఉన్నాయని వాటిని కొట్టుకోవాలని కురుబవాండ్లపల్లికి చెందిన ఓ వ్యాపారికి సంబంధిత అధికారులు సూచించారు. అయితే ఆదివారం వారు చెట్లు కొట్టే సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో వ్యాపారి పెద్ద సంఖ్యలో వేప, జాలిచెట్లను నరికి వేయించి టెంపో వాహనంలో తరలించారు. ఈ ఘటనపై 'సాక్షి' షీఫారం డీడీ వెంకటస్వామిని వివరణ కోరగా తమ షీఫారం సరిహద్దులో వేప, జాలి చెట్లు నరకలేదన్నారు. పక్కనున్న రైతుల పొలాల్లో వాటిని కొట్టి ఉండవచ్చన్నారు.

ఘనంగా అష్ఫాఖుల్లాఖాన్ జయంతి

హిందూపురం టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫాఖుల్లాఖాన్ జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో ముస్లిం నగరా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో కాకోరి రైలు సంఘటనలో అష్ఫాఖుల్లాఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్‌కు ఉరిశిక్ష పడిందన్నారు. మాతృభూమి కోసం ఉరికంబమెక్కిన అశ్వాఖుల్లాఖాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

శక్తి స్వరూపిణీ నమోస్తుతే !

సాక్షిబృందం: నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో అమ్మవారి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగానే అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.



హిందూపురం: రాజరాజేశ్వరిగా వాసవీమాత



హిందూపురం: వారాహిదేవిగా గంగమ్మదేవి



గుడిబండ: దుర్గామాతగా తుమ్మల మారెమ్మ



పరిగి: అలంకరణలో కాళికామాత



రొళ్ల మండలం రత్నగిరిలో దుర్గాదేవి అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మి



అలంకరణలో మధూడి వీరభద్రస్వామి



పావగడ: దుర్గమ్మ అలంకరణలో అమ్మవారు

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

పెనుకొండ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు ఉపాధి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాలలోని స్కిల్ హబ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణ ఉంటుంది. ఇంటర్, డిగ్రీ, ఆపై చదివిన యువతీయువకులు అర్హులు. శిక్షణ అనంతరం వీరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 29వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ శివప్రసాద్ (96767 06976)ను సంప్రదించవచ్చు.

శిల్పారామంలో దసరా సంబరాలు

పుట్టపర్తి రూరల్: స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం దసరా సంబరాలు మిన్నంటాయి. శిల్పారామం పాలనా అధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శాస్త్రీయ నృత్యాలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. దసరా విశిష్టతను వక్తలు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సినిమా పాటలు, డ్యాన్స్‌లతో యువత హోరెత్తించింది. కళాకారులకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలను పుట్టపర్తి అర్బన్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.



రొద్దం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారంతా తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకోవడంతో సందడి నెలకొంది. 24 ఏళ్ల తరువాత ఒకే వేదికపైకి రావడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తమ చిన్ననాటి మధుర క్షణాలను మళ్లీ గుర్తు చేసుకున్నారు. ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు.

కారును ఢీకొన్న ట్రక్



చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో కారును ట్రక్కు ఢీకొన్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కోడూరు వైపు నుంచి వచ్చిన ట్రక్కు పక్కన వెళుతున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఎక్స్ సీఆర్‌పీఫ్ అంటూ ఓ మహిళ హల్‌చల్ చేసింది. ట్రక్కు తమదేనని, ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదంటూ బాధితులను బెదిరించి పంపించింది. సీసీ కెమెరాల్లోనూ ప్రమాదం రికార్డు అయినా పోలీసులు పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అయితే బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఆలయ నిర్వహణ బాధ్యత రాజవంశీకులదే

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- రాజవంశీకులకు నకలు అందజేసిన ఎంపీలు, ఎమ్మెల్సీ



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీలు రంగయ్య, మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ




ప్రభుత్వ జీఓ కాపీని రాజవంశీకుడు దొర రంగప్ప రాజుకు అందజేస్తున్న దృశ్యం

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయ నిర్వహణ బాధ్యతను దేవదాయశాఖ నుంచి తిరిగి రత్నగిరి సంస్థాన రాజవంశీకులకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల నకలును ఆదివారం రాజవంశీకులకు ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ అందజేశారు. 2015లో గ్రామస్తుల అభ్యర్థన మేరకు మహాలక్ష్మి ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి చేరుస్తూ అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవో వెలువరించింది. అనంతరం ఆలయ అభివృద్ధిని అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఆలయ నిర్వహణ బాధ్యత తామే తీసుకుంటామంటూ ప్రభుత్వం దృష్టికి రత్నగిరి సంస్థాన దొర రంగప్పరాజు తీసుకెళ్లారు. దీనిపై జగన్ సర్కార్ సానుకూలంగా స్పందిస్తూ జీవో జారీ చేసింది. ఈ జీవో నకలును ఆదివారం రాజవంశీకుడు దొర రంగప్పరాజుకు అనంతపురం, హిందూపురం ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో వారిని ఘనంగా స్వాగతించారు. ఆలయంలో విశేష పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, సర్పంచ్ చిన్నరంగప్ప, ఎంపీపీ కవిత, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పామిడి వీర, వాల్మీకి కులస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నంది విగ్రహం వద్ద పర్యాటకుల సందడి



ఏడు శిరస్సుల నాగేంద్రుడి విగ్రహం వద్ద ఫోటోలు తీసుకుంటున్న దృశ్యం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



వేలాడే స్తంభం కింద నుంచి దుప్పట్టా లాగి పరిశీలిస్తున్న యువత

లేపాక్షిలో పర్యాటక సందడి

లేపాక్షి: శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాష్టమిని పురస్కరించుకుని లేపాక్షి ఆలయం పర్యాటకులతో కిక్కిరిసింది. దుర్గామాత దర్శనం కోసం భక్తులు, పర్యాటకులు బారులు తీరారు. నాట్యమంటపం, కల్యాణ మంటపం, ఏడుశిరస్సుల నాగేంద్రుడి విగ్రహం, లతా మంటపం, నంది విగ్రహం, థీం పార్కు తదితర ప్రాంతాల్లో సందడి నెలకొంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

షాప్స్ అమ్మబడును

- ATP, KLD రోడ్‌లో ఉన్న పాండ ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు వందన శారీస్ & కిడ్స్‌వేర్ షాప్ అమ్మబడును. సెల్ : 9030309695, 9866012861. [A-776924]

TOLET

- ATP, రామ్‌నగర్, 80 ఫీట్ రోడ్డులో అన్ని ఆధునిక వసతులు గల 1300 చ.అ. 2 BHK ఫ్లాట్ బాడుగకు కలదు. సెల్ : 9440060878, 9948660609. [A-776922]

HOUSE FOR SALE

- అనంతపురము, బళ్ళారి రోడ్డు నందు స్కంద వెంచర్ ప్రక్కన వున్న S.V.R.S. వెంచర్, బ్రాహ్మణపల్లి నందు ఉడ్‌వర్క్‌తో కూడిన 2BHK ఇల్లు అమ్మకానికి కలదు. సంప్రదించవలసిన నెం : 900485162 (నో బ్రోకర్స్). [A-1265]

SERVICES

- వ్యక్తిగత వ్యవసాయ భూములకు పర్సనల్ రైతులకు, ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు మొదలగు వారికి ఆర్థిక సలహాలు మరియు సహాయం చేయబడును. సంప్ర: 9034053557 [T-181]

బంగారం కొనబడును

- మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-5947]

BUSINESS OFFER

- ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు **Agents** గా కావలెను. ఫోన్ : 7015828102 [HA-788339]

WANTED

- ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన యువతులు కావలెను. సంప్ర : ఫోన్ : 9703927945. [A-776923]
- SR Defence Academy కి అనంతపురం నందు పనిచేయుటకు PRO's, PET's and JL's కావలెను. Qul: Any Degree, Sal: 10K-30K, 9000852892, 78933 18282. [T-1177901]
- ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 7730899503 [G-1175]
- ATP ప్రముఖ పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు అకౌంటెంట్, అర్హత : డిగ్రీ కలిగి వుండి లేదా కంప్యూటర్ నందు Tally అనుభవం కలవారు సంప్ర : 9441984127. [A-1266]
- ప్రముఖ కంపెనీలో జిల్లా/మండలాల వారిగా పనిచేయుటకు కో ఆర్డినేటర్లు కావలెను. Sal: 20,000 ఆపైన, Send Resume వాట్సాప్. ✆ 7330552222. [T-1177903]
- రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను, భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]
- Require One Asst. Chemist for Lab at Kurnool. QUALIFICATION: B.Sc. Chemistry (Pass or Fail). Mail Id:raghunathdyechempvtltd@gmail.com. Contact Number: 94402 43049 [L-798864]
- ప్రముఖ ఫుడ్ & బేవరేజెస్ కంపెనీ, అనంతపురము జిల్లాలో మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. మంచి జీతం + ఇన్సెంటీవ్స్, TA, DA లు కలవు, Q : MBA + ఏదైనా కూల్ డ్రింక్స్ మార్కెటింగ్‌లో కనీసం 3 సం॥ అనుభవం గలవారు బయోడేటాని వాట్సాప్ ద్వారా పంపగలరు. 9499499419. [A-776917]
- నోబుల్ హెల్త్‌కేర్ సర్వీసెస్ అనంతపురము నందు వృద్ధులు, బెడ్ రీడన్ పేషెంట్స్ పక్షవాతం పేషెంట్స్, బేబీ కేర్, కేర్ టేకర్స్ 24 గంటలు పనిచేయుటకు ఓర్పుగల ఆయాలు, నర్సులు ఆడ మరియు మగ కావలెను. వారికి ఆకర్షణీయమైన జీతం మరియు ఉచిత భోజనము వసతి సదుపాయం కలదు. వివరాలకు సంప్రదించవలసిన నెంబర్లు 9441018078, 6301341831. [A-7341]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బంగారు అడిగాలరమ్మ చిత్రపటం ఊరేగింపు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న భక్తులు

హిందూపురం: ఓంశక్తి ఆలయ గురువు శక్తి బంగారు అడిగాలరమ్మ స్వర్గస్తులైన సందర్భంగా ఆదివారం ఆలయం మోడల్‌కాలనీలోని అమ్మవారి ఆలయంలో భక్తులు సంతాప సభ నిర్వహించారు. ఆలయంలో చిత్రపటం కొలువుదీర్చి భజనలు చేసి ఊరేగింపు నిర్వహించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుకొండ: నగర పంచాయతీకి చెందిన 65 మంది పారిశుధ్య కార్మికులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు జయ శంకరరెడ్డి, ఆయన సోదరుని కుమార్తె నగర పంచాయతీ వైస్ చైర్మన్ నందినిరెడ్డి నూతనవస్త్రాలను పంపిణీ చేశారు. ఆదివారం నగర పంచాయతీ కార్యాలయంలో వాటిని కార్మికులకు అందజేశారు. ముఖ్య అతిథి పాల్గొన్న నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివన్నారు. అలాంటి వారికి దసరా పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్, మండల అగ్రి కమిటీ చైర్మన్ కొండలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలకు నిప్పు



కాలిపోయిన పైపులు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన రైతు పూలకుంట నరసింహప్ప పొలంలో డ్రిప్ పరికరాలకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. దీంతో రూ. 1.50 లక్షల విలువైన డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ముదిగుబ్బ/తలుపుల: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... తలుపుల మండలం వీరప్పగారిపల్లికి చెందిన శ్రీనివాసులు(27) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా జబ్బు నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం అనంతపురంలో వైద్య చికిత్స చేయించుకుని భార్య మానసతో కలసి ఆమె పుట్టినిల్లైన నల్లమాడ మండలం వంకరకుంటకు బయలుదేరాడు. మార్గమధ్యలో మలకవేమల రైల్వే లెవల్ క్రాస్ వద్ద గేటు వేయడంతో ద్విచక్ర వాహనాన్ని ఆపి నీళ్లు తాగి వస్తానంటూ పట్టాలు దాటి అటువైపుగా వెళ్లాడు. కాసేపటి తర్వాత అటుగా వచ్చిన రైలు కిందకు దూరి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించడంతో బోగి తగిలి ఎగిరి పడి మృతిచెందాడు. మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి... కదిరి ఏరియా ఆస్పత్రికి చేరుకుని శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించారు.

బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయం

గోరంట్ల: స్థానిక మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్‌కు చెందిన బ్యాంక్ ఖాతా నుంచి పెద్ద మొత్తంలో నగదు మాయమైంది. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గోరంట్లలోని ఎస్‌బీఐ శాఖలో నూర్ మహమ్మద్‌కు ఖాతా ఉంది. ఈ ఖాతా నుంచి నాలుగు విడతలుగా రూ.41వేలకు పైగా నగదు ఆయనకు తెలియకుండానే సైబర్ నేరగాళ్లు అపహరించారు. ఈ నెల 18, 19 తేదీల్లో రూ.23 వేలు, 20వ తేదీన రూ.8,900, 22న రూ.10వేలు మాయమయ్యాయి. ఆదివారం రాత్రి ఈ విషయాన్ని గుర్తించిన ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

అనంతపురం: పూర్వ వాలీబాల్ ఆటగాళ్లు ముస్తఫా అలీఖాన్, నగేష్ కుమార్ జ్ఞాపకార్థం నిర్వహించిన వాలీబాల్ టోర్నీ ఆదివారం నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ముగిసింది. నార్పల, పుట్టపర్తి, అనంతపురం హాస్పిటల్, అనంతపురం స్టేడియం పురుషుల జట్లు విజేతలుగా నిలిచాయి. అలాగే మహిళా విభాగంలో అనంతపురం స్టేడియం, లేపాక్షి, యోధ జట్లు విజేతలుగా నిలిచాయి.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

హిందూపురం టౌన్: దసర నవరాత్రుల్లో భాగంగా పట్టణం లోని నింకంపల్లి రోడ్డులో వెలసిన ఎల్లమాంబ ఆలయంలో ఎరుకుల కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి చిన్నమార్కెట్ మీదుగా భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నైవేద్యంగా కల్లు ముంతలు, జ్యోతులను మోసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఎరుకుల సంఘం నాయకులు శంకరయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు నంజప్ప, రమేష్, నారాయణ, నాగరాజు, యల్లప్ప, ఆంజనేయులు, హనుమంతప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా జ్యోతులను మోసుకెళ్తున్న భక్తులు

రెడ్డి జేఏసీ నాయకుడికి పరామర్శ

హిందూపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, నాయకులు ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యసిబ్బందిని కోరారు. వెంకటేష్‌రెడ్డి వాహనాన్ని ఢీకొట్టి ఘర్షణకు దిగిన నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

నిర్మాణ పనుల పరిశీలన

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురంలో నీలకంఠేశ్వరస్వామి సముదాయ దేవాలయాలను ఆదివారం ఏపీ పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పలరాజు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగాల గౌతమ్ సందర్శించారు. అనంతరం టీటీడీ సహకారంతో నిర్మిస్తున్న నీలకంఠాపురం దేవస్థానముల కళ్యాణ మండప నిర్మాణాపు పనులను పరిశీలించారు.

35 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక

హిందూపురం టౌన్: మణిశరణ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేవీ చలపతి, ఎంహెచ్ ఈడబ్ల్యూహెచ్ఎస్ ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా, పుష్పగిరి నేత్రాలయ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రమౌళి శిబిరాన్ని ప్రారంభించగా పరీక్షలు నిర్వహించి 35 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు.

కదిరి జట్టు విజయం

మడకశిర: మడకశిర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అనంత ప్రీమియర్ లీగ్ - 2023 అండర్ 15 పోటీలను నిర్వహించారు. మడకశిర- కదిరి జట్లు తలపడగా కదిరి జట్టు విజయం సాధించింది. డాక్టర్ క్రిష్ణమూర్తి తన వంతుగా క్రీడా సామగ్రి కోసం రూ.20 వేలు అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఈసీ మెంబర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

పెనుకొండ రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం దొమ్మతిమర్రి నుంచి పెనుకొండకు ద్విచక్ర వాహనాలలో మద్యం తరలిస్తుండగా మార్గమధ్యలో పులేకమ్మ ఆలయం వద్ద రవి, రమేష్, సురేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 11 కేసుల మద్యాన్ని స్వాధీనం చేసుకొని రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు.

● మెగా రక్తదాన శిబిరం

అగళి: విజయ దశమిని పురస్కరించుకొని అగళి మండలం కదిరేపల్లి గ్రామంలో ఆదివారం రావుడి వీరంజనేయ యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 32 మంది రక్తదానం చేశారు.